# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అన్ని రాష్ట్రాల ఉమ్మడి సహకారంతోనే వికసిత్ భారత్ 2047 నాటికి సాకారమవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు.**
3. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**
4. **వర్షాలు, వరదలు కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు.**
5. **తెలంగాణ నూతన గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు.**
6. **రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు 5 వేల కోట్ల రూపాయలు కేటాయించామని కేంద్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు.**

==========================

అన్ని రాష్ట్రాల ఉమ్మడి సహకారంతోనే వికసిత్ భారత్ 2047 సాకారమవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. నిన్న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రిఅధ్యక్షతన నీతి ఆయోగ్ 9వ పాలకవర్గ సమావేశమైంది. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, ఇతర సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ చైర్మన్ హోదాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... వికసిత్ రాష్ట్రాలే వికసిత్ భారత్ అని, 2 వేల 47 సంవత్సరం నాటికి వికసిత్ భారత్ సాధించడమే ప్రతి భారతీయుని ఆశయమని పేర్కొన్నారు. భారత్ అంతర్జాతీయ పెట్టుబడులకు అనువుగా రాష్ట్రాలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రజలతో నేరుగా అనుసంధానమై రాష్ట్రాలు వికసిత్ భారత్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని లక్ష్యాలు సాధించాలని ప్రధానమంత్రి సూచించారు.

ఇలా ఉండగా... ఈ సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ, దేశంలో సంపూర్ణ పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజా భాగస్వామ్యం విధానాన్ని

దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రతిపాదించారు. వికసిత భారత్‌లో ఆంధ్రప్రదేశ్ తనవంతు పాత్రను పోషించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా నిన్న విజయవాడలో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించామన్నారు. ఆయా ప్రాంతాల్లో 8.2 శాతం ఆర్థిక అభివృద్ధిని లక్ష్యంగా నిర్దేశించామని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి 50 వేల 474 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రతోపాటు ప్రకాశం జిల్లాను కూడా వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి.... ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని తెలిపారు.

---------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీతి ఆయోగ్ సమావేశం అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో నిన్న సమావేశమైయ్యారు. ఈసందర్భంగా పోలవరం ప్రాజెక్టు అంశంపై ముఖ్యమంత్రి చర్చించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరామన్నారు. పోలవరానికి సంబంధించి పాతబకాయిలు ఇవ్వాలని కోరామని చెప్పారు. నవంబర్ నాటికి పోలవరం నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 112వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్కు, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

---------------------------

భారీ వర్షాలు, వరదలు కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వరద ప్రభావిత పరిస్థితులపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్నందున అధికారులందరూ అప్రమత్తంగా పనిచేయాలని, లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరదలు కారణంగా ఏ ఒక్క రైతు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

వికసిత్ భారత్ దిశగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని కేంద్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. నిన్న హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర బడ్జెట్ 2024 పై మంత్రి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది 5 వేల కోట్ల రూపాయలకుపైగా రైల్వే బడ్జెట్‌ను తెలంగాణకు కేటాయించామన్నారు. 48 వేల కోట్ల రూపాయల రోడ్డు ప్రాజెక్టులు చేపడుతున్నామని, పేదల సాధికారత కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టామని, రైతుల పంటకు కనీస మద్దతు ధర కల్పించే దిశగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రత పథకంగా ప్రధానమంత్రి గరీభ్ కల్యాణ్ అన్నయోజనను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

దేశంలోని పలు రాష్ట్రాలకు గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ నూతన గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ నియమితులయ్యారు. ప్రస్తుతం తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణన్‌ను మహారాష్ట్ర గవర్నర్ గా నియమించారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ కాలేయ వ్యాధుల అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ–డబ్ల్యూహెచ్ఓ పిలుపు మేరకు ప్రతి ఏటా జూలై 28వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ వ్యాధికి గురైన వారికి కాలేయం నిదానంగా దెబ్బతింటుంది. ప్రస్తుతం ఈ వ్యాధి నివారణకు హెపటైటిస్ ఎ,బి టీకాలు అందుబాటులో ఉన్నాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఉత్తమ ఆహారపు అలవాట్లు, తగిన వ్యాయామం చేయడం ద్వారా ఈ వాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు. ప్రపంచ కాలేయ వ్యాధుల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రుపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు సాయంకాలం 4 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

హైదరాబాద్‌లోని పాతబస్తీలో ఈరోజు లాల్ దర్వాజా మహాకాళి బోనాలు జరుగుతున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. బోనాల సందర్భంగా ఛత్రినాక ప్రాంతంలో, లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహాకాళి అమ్మవారి ఆలయం వద్ద నుంచి అక్కన్న మాదన్న దేవస్థానం వరకు ఏనుగుపై ఘటాల ఊరేగింపు ఉంటుందని, ఈ క్రమంలో ఈ రోజు, రేపు ఫలక్ నుమా, చార్మినార్, మీర్ చౌక్, బహదూర్ పురా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతాయని చెప్పారు. అంబారీ ఊరేగింపు సందర్భంగా మదీనా క్రాస్ రోడ్స్, ఇంజన్ బౌలి, గుల్జార్ హౌస్, చార్మినార్, హిమ్మత్ పురా, నాగులుచింత రహదారుల పై ఎలాంటి వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

---------------------------

హైదరాబాద్ నగరాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర శాసనసభ వద్ద పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ బడ్జెట్‌లో హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాలకు 10 వేల కోట్లు ప్రభుత్వం కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రిజర్వేషన్లకు అనుగుణంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని గోదావరి పరివాహక జలాశయాలకు వరద ప్రవాహం పెరుగుతోంది. తెలంగాణలోని శ్రీరాంసాగర్‌కు 27 వేల క్యూసెక్కులు, నిర్మల్ కడెం ప్రాజెక్టుకు 8 వేల 153 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. భద్రాచలం వద్ద గోదావరి ప్రస్తుత నీటిమట్టం 53 అడుగులకు చేరడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద 52 వేల 199 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా, 6 వేల 282 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 14 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండటంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సముద్రంలోకి 13లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కోనసీమలోని గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీ పాయలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, కోనసీమలోని లంక గ్రామాలు జలమయమయ్యాయని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వరదనీరు దిగువకు వదులుతుండడంతో కేంద్రపాలిత ప్రాంతం యానాంలో ప్రవహించే గౌతమీ గోదావరికి వరద ఉద్ధృతి పెరిగిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

======================